సాక్షి
అనకాపల్లి
బుధవారం । 17 । ఏప్రిల్ । 2024



## సిరులతల్లికి అష్టదళాపద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.



## రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభ

విశాఖ: రైఫిల్ షూటింగ్‌లో జాతీయ స్థాయి ఎంపికకు వెళుతున్న విద్యార్థులు జాయ్ సి, ఎమ్మి రతన్‌లను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

గరిష్టం/కనిష్టం
38.0/28.0

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుందని, వడగా లులు వీచే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

## న్యూస్‌రీల్

### పోలింగ్ ఘట్టం అత్యంత కీలకం

- మాడుగులలో ఎన్నికల శిక్షణను పరిశీలించిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



శిక్షణ తరగతుల పరిశీలన అనంతరం బయటకు వస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

మాడుగుల రూరల్: ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ ఘట్టం అత్యంత కీలకమైనదని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రిసైడింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలనతో అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. మాడుగుల జెడ్పీ బాలుర, బాలికల హైస్కూలులో పీవో, ఏపీవోల శిక్షణ తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. శిక్షకులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ శిక్షణ తరగతుల్లో ఏఆర్వో టి. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మయ్య, నాలుగు మండలాలకు చెందిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దారు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు రాజా, సీనియర్ సహాయకుడు పూర్ణయ్య, వీఆర్వోలు, వీఆర్ఏలు, ఎన్నికలు సిబ్బంది పాల్గొన్నారు.

### మీకెందుకు ఓటెయ్యాలి?

- ప్రచారంలో సీఎం రమేష్ సోదరికి చేదు అనుభవం



బైలబంద చెరువులో కూటమి అభ్యర్థులను నిలదీస్తున్న కూలీలు

బుచ్చెయ్యపేట : మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన అనకాపల్లి ఎంపీ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ సోదరికి చేదు అనుభవం కలిగింది. మంగళవారం రమేష్ సోదరి విజయలక్ష్మి, బీజేపీ, టీడీపీ నాయకులు ఈర్లె శ్రీరామ్మూర్తి, డొంకిన అప్పలనాయుడు, సర్పంచ్ సుంకరి లక్ష్మి తదితరులు బుచ్చెయ్యపేటలో బైలబంద చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. దీనికి ఉపాధి పనులు చేస్తున్న కూలీలు బదులిస్తూ ఏం చేశారని ఓటు మీకు వేయాలంటూ ఎదురు ప్రశ్నించారు. గ్రామానికి చెందిన కొల్లి రాము, సుంకరి సూరమ్మ, లక్ష్మి, ఐయితరెడ్డి రామలక్ష్మి, మాటూరి భవానీ, బంటు లక్ష్మి తదితరులు మీకెందుకు ఓటేయాలని ప్రశ్నించడంతో కంగుతిన్న కూటమి నాయకులు...ఏం చేయాలో తెలియక మీ సమస్యలు చెప్పండి తీరుస్తామని అంటూ అక్కడి నుంచి మెల్లగా జారుకున్నారు.

### విద్యార్థుల్లో నైపుణ్యం పెంపునకు చర్యలు

- డీఈవో వెంకటలక్ష్మి



విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటలక్ష్మి


మునగపాక : విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మి అన్నారు. చదువులో విద్యార్థుల స్థాయిని గుర్తించి మరింత పదును పెట్టి, గ్రేడ్‌లు సాధించేందుకు అవసరమయ్యే ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. మంగళవారం ఆమె టి.సిరసపల్లి, వెంకటాపురం, నాగులాపల్లి, మునగపాక పాఠశాలల్లో రాష్ట్ర స్థాయి సర్వేలో భాగంగా ఆమె విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. నాల్గవ తరగతి విద్యార్థుల సౌలభ్యం కోసం స్లాస్ విధానం అమలు జరుగుతుందన్నారు. ఆమె వెంట క్షేత్రస్థాయి పరిశీలకులు కర్రి లక్ష్మినారాయణ, అచ్యుతకృష్ణ, నూకేష్ పాల్గొన్నారు.

### బాలికల గురుకులాల్లో సీట్ల భర్తీకి 19న కౌన్సెలింగ్

కశింకోట : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న బాలికల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలు కల్పించగా ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 19న ఉదయం 9 గంటలకు కశింకోట మండలంలోని తాళ్లపాలెం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి. గ్రేస్ తెలిపారు. తాళ్లపాలెంతో పాటు జిల్లాలోని కొక్కిరాపల్లి, నక్కపల్లి, నర్సీపట్నం, మేహాద్రిగెడ్డ, కోనాం, మధురవాడ సీఓఈ గురుకులాల్లో ఖాళీలున్నాయన్నారు. వీటిని భర్తీ చేయడానికి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొని రావాలని కోరారు.

# అధికారం కోసం ఆబగా...!

- పదవులకోసం అయ్యన్న కుటుంబం ఎదురుచూపులు
- మండలానికి ఒకరు చొప్పున అధికారం పంపిణీ
- ఇప్పటికే మున్సిపాలిటీలో భార్య పెత్తనం
- పాత రోజులు మాకొద్దు బాబోయ్ అంటున్న ప్రజలు



సాక్షి, అనకాపల్లి: ఎంపీ సీటు ఆశించిన ఒక కుమారుడు... ఎమ్మెల్యే సీటు ఆశించిన మరో కుమారుడు... మున్సిపాలిటీలో ఇప్పటికే కౌన్సిలర్‌గా ఉన్న సతీమణి... ఎమ్మెల్యే బరిలో ఉన్న అయ్యన్న ఇలా నలుగురూ అధికారం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే నలుగురూ చెరోవైపు ప్రచారం నిర్వహిస్తుండగా... ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పెత్తనాన్ని కూడా నలుగురూ పంచుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కుటుంబానికి ఒక సీటే అని చంద్రబాబు తమకు ఇప్పటికే దెబ్బ వేశారనే కసితో ఉన్న సదరు కుటుంబం... నర్సీపట్నం నియోజకవర్గాన్ని నాలుగువైపులా పంచుకుని అధికారం చెలాయించేందుకు సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అన్న చందంగా అయ్యన్న వ్యవహారం ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో అయ్యన్న, ఆయన కుమారుడు చక్రం తిప్పి నర్సీపట్నంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు లేటరైట్‌ను అక్రమంగా తవ్వి అక్రమ సంపాదన ఆర్జించారు. అంతేకాకుండా మూడు ఆక్రమణలు... నాలుగు రంగురాళ్లు అన్న చందంగా రంగురాళ్ల వెలికితీత కూడా చేశారన్న ఆరోపణలున్నాయి. అయ్యన్నపాత్రుడు మంత్రిగా ఉన్న సమయంలో కొడుకు విజయ్, భార్య పద్మావతి జోక్యం విపరీతంగా ఉండేదన్న విమర్శలున్నాయి. వీరికితోడు ఇప్పుడు సకుటుంబ సపరివార సమేతం అనే రీతిలో అధికారం చెలాయించేందుకు ఆబగా ఎదురుచూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అయ్యన్నకు ఓటు వేస్తే నలుగురు ఎమ్మెల్యేలు.... తనకు ఓటు వేస్తే ఒక్కరే ఎమ్మెల్యే అని... తన కుటుంబంలో ఎవ్వరికీ రాజకీయ ఆకాంక్షలు లేవని ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలకు స్పష్టంగా ప్రకటించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సీట్లను ఆశించి....!**

వాస్తవానికి ఎంపీగా తన కొడుకుకు అవకాశం ఇవ్వాలంటూ చంద్రబాబు సాక్షిగా అయ్యన్న కోరారు. తనకు ఎమ్మెల్యేగా, కొడుకుకు ఎంపీగా అవకాశం ఇవ్వాలని... స్థానిక అభ్యర్థులను కాదని బయటివారికి ఎలా ఇస్తారంటూ పార్టీ సమావేశాల్లో ప్రశ్నించారు. తీరా బీజేపీ కోటాలో బాబు శిష్యుడు సీఎం రమేష్ అనకాపల్లి సీటును కొట్టేశారు. నాన్ లోకల్ అయినప్పటికీ సీఎం రమేష్‌ను మాత్రం అయ్యన్న ఒక్క మాట కూడా అనలేదు. మరోవైపు అన్న కోసం ఎంపీ సీటు కోరిన నేపథ్యంలో ఎమ్మెల్యే సీటు తనకు ఇవ్వాలని కోరాలంటూ చిన్న కుమారుడు పోరు పెట్టారు. రాజకీయ వారసత్వం కోసం కొడుక్కి సీటు ఇప్పించాల్సిందేనని ఇంటిపోరు కూడా అయ్యన్నకు ఎక్కువయ్యింది. ఈ నేపథ్యంలో వచ్చిన ఒక్క ఎమ్మెల్యే సీటును నలుగురూ పంచుకుని అధికారం చెలాయిద్దామనే ఆలోచనకు వచ్చినట్టు తెలుస్తోంది.

### ఏ ఒక్క పదవినీ వదలరు

మొదట్లో అయ్యన్నపాత్రుడు, సోదరుడు చింతకాయల సన్యాసిపాత్రుడు సమన్వయంతో రాజకీయాలు నడిపేవారు. ఈ సమయంలో పెద్ద కొడుకు విజయ్ జోక్యం పెరిగింది. సన్యాసిపాత్రుడు కదలికలను తెలుసుకునేందుకు కారులో వాయిస్ రికార్డర్ అమర్చారు. ఈ వ్యవహారం కుటుంబ కలహాలకు దారితీసింది. ఈ సంఘటనతో అయ్యన్నపాత్రుడి వద్ద ఇమడలేక సన్యాసిపాత్రుడు, మిగిలిన సోదరుల కుటుంబ సభ్యులు బయటకు వచ్చేశారు.

ఏ ఒక్క పదవీని అయ్యన్నపాత్రుడు కుటుంబం వదలేదు. పురపాలిక ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి కౌన్సిలర్‌గా ఎన్నికై 26వ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. చిన్న కుమారుడు రాజేష్ 25వ వార్డుకు కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆఖరి మొత్తం పదవులన్నీ వారి కుటుంబంలో ఉంచుకున్నారు. ఎమ్మెల్యేగా గణేష్ గెలిస్తే ప్రజలు నేరుగా వెళ్లి పనులు చేయించుకునేందుకు వెసులుబాటు ఉంటుందనీ, టీడీపీ గెలిస్తే ముగ్గురిని దాటుకుని అయ్యన్నపాత్రుడి వద్దకు వెళ్లాల్సి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే గణేష్ ఐదేళ్ల కాలంలో ఎలాంటి వేధింపులు, బెదిరింపులు లేవని, ప్రశాంతంగా ఉందని, కొరివితో తల గోక్కున్నట్టు అయ్యన్నను మళ్లీ తెచ్చుకుంటామా అని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

# మంచి ముహూర్తానికి..!

- నామినేషన్లకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- రేపటి నుంచి 25 వరకు నామినేషన్లు దాఖలుకు గడువు
- 18 నుంచి 24 వరకు సుముహూర్తాలు



సాక్షి, విశాఖపట్నం : నామినేషన్ల హడావుడి గురువారం నుంచి ప్రారంభమకానుంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఈనెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల సమర్పణకు అవకాశం ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆ మధ్య కాలంలో ఏరోజు ముహూర్తం బాగుందో తెలుసుకుని, ఆరోజు నామినేషన్లు వేయాలని చాలామంది అభ్యర్థులు ఆరాటపడుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచే రాజకీయ నాయకులు మంచి ముహూర్తాల కోసం పండితులు, సిద్ధాంతులను ఆశ్రయిస్తున్నారు. ఆయా అభ్యర్థుల జాతక చక్రాలు, నామ/జన్మ నక్షత్రాలకు అనుగుణంగా వీరు ముహూర్తాలను నిర్ణయిస్తున్నారు. పంచాంగం ప్రకారం చూస్తే ఈనెల 18, 19, 22, 23, 24 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. ఇప్పటికే ఉమ్మడి విశాఖలో సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చాలావరకు ముహూర్తాలను నిర్ణయించుకున్నారు. అభ్యర్థుల జాతకంలో రవి గ్రహం, రవి, కుజ, శని గ్రహాలు బలంగా ఉంటే విజయావకాశాలు మెండుగా ఉంటాయని చెబుతారు. అందువల్ల అలాంటి ముహూర్తాలు ఏ సమయంలో ఉన్నాయో పరిశీలించి నిర్ణయం జరుగుతుందని విశాఖకు చెందిన స్మార్త పురోహితుడు చేబియ్యం రవిశర్మ 'సాక్షి'కి చెప్పారు. కొంతమంది అభ్యర్థులు మంచి ముహూర్తాలకు, మరికొందరు సెంటిమెంటుతో పాటు వారాలకు ప్రాధాన్యతనిస్తారని అందుకనుగుణంగా శుభగడియలను పడికట్టి ముహూర్తాలను నిర్ణయిస్తామని కేవీకే శాస్త్రి అనే మరో పురోహితుడు తెలిపారు.

### ఏ రోజు ఎవరు నామినేషన్?

| తేదీ | నియోజకవర్గం | అభ్యర్థి పేరు | పార్టీ |
|---|---|---|---|
| 24.4.24 | అనకాపల్లి (లోక్‌సభ) | బూడి ముత్యాలనాయుడు | వైఎస్సార్‌సీపీ |
| 19.4.24 | యలమంచిలి | యూవీ రమణమూర్తిరాజు | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | పాయకరావుపేట | కంబాల జోగులు | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | చోడవరం | కరణం ధర్మశ్రీ | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | అనకాపల్లి | ఎం.భరత్ | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | మాడుగుల | బి.అనూరాధ | వైఎస్సార్‌సీపీ |
| 23.4.24 | నర్సీపట్నం | పెట్ల ఉమాశంకర్ గణేష్ | వైఎస్సార్‌సీపీ |
| 19.4.24 | నర్సీపట్నం | సీహెచ్ అయ్యన్నపాత్రుడు | టీడీపీ |
| 19.4.24 | పెందుర్తి | అదీప్‌రాజ్ | వైఎస్సార్‌సీపీ |
| 24.4.24 | గాజువాక | గుడివాడ అమర్నాథ్ | వైఎస్సార్‌సీపీ |
| 18.4.24 | యలమంచిలి | ఎస్.విజయకుమార్ | జనసేన |
| 19.4.24 | పాడేరు | విశ్వేశ్వరరాజు | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | రంపచోడవరం | నాగులాపల్లి ధనలక్ష్మి | వైఎస్సార్‌సీపీ |
| 22.4.24 | అరకు | ఆర్.మత్స్యలింగం | వైఎస్సార్‌సీపీ |

# ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తే కేసులు




నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు బందోబస్తు
- నేర సమీక్షలో ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాలో దుష్ప్రచారాలను, ఫేక్ న్యూస్‌లను వ్యాప్తి చేసేవారిపై కేసులు నమోదు చేసి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రోపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సి.ఆర్.పి.సి. కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను సమీక్షించి ఆయా కేసుల్లో దర్యాప్తు, పెండింగ్‌లో ఉంచడానికి కారణాలను సంబంధిత అధికారులను ఎస్పీ అడిగి తెలుసుకుని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేసి డబ్బు, మద్యం, ఇతర ఉచిత కానుకల తరలింపును సీజ్ చేయాలన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, పోలీస్ అధికారులు సమాచారం సేకరించి ప్రత్యేక కార్యాచరణతో, వివిధ శాఖల సమన్వయంతో దాడులు నిర్వహించాలని తెలిపారు. రాజకీయ నాయకుల ఎన్నికల బహిరంగ సభల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ, డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించి ఎటువంటి దుందుడుకు చర్యలు చోటుచేసుకోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు బందోబస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆ సమయంలో అభ్యర్థికి సంబంధించి మూడు వాహనాలతోపాటు అతనితోపాటు ఐదుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా కేసులో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలు అందజేసి సత్కరించారు. అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, అనకాపల్లి, పరవాడ సబ్ డివిజన్ల డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, బి.అప్పారావు, దిశా, ఎ.ఆర్. డీఎస్పీలు ఎం. ఉపేంద్రబాబు, పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, సతీష్, సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, శ్రీనివాస్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నైరాశ్యంలోనే మాటల 'దాడి'

- ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి కనబడలేదా..?
- ఇతరులను దూషించి ఎదగాలనుకోవడం తప్ప
- మీ డప్పు చాలించండి
- సీఎం జగన్ వల్లే గెలిచాం...
- మాజీ మంత్రి దాడి వీరభద్రరావుపై విరుచుకుపడిన ఎంపీ సత్యవతి



మీడియాతో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి

సాక్షి, అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అనకాపల్లిలో జరిగిన అభివృద్ధి టీడీపీ నేతలకు కనిపించలేదా..? తన వారసుడిని రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఫ్రస్టేషన్ దాడి వీరభద్రరావులో కనిపిస్తోందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి ధ్వజమెత్తారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లతో పాటు తనపై మాజీ మంత్రి దాడి చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. అనకాపల్లిలో సీనియర్ రాజకీయ నేతగా ఇప్పటివరకూ గౌరవం ఇచ్చామని..ఇవన్నీ మరిచిపోయి సభ్యత పక్కనపెట్టి నిన్న ఒక వేదికపై మీరు మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలని ఆమె దాడి వీరభద్రరావును ఉద్దేశించి డిమాండ్ చేశారు. ఇదే మరోసారి పునరావృతమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సివస్తుందని హెచ్చరించారు. మంగళవారం అనకాపల్లి పట్టణం వివేకానందానగర్‌లో గల ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

**మార్కెట్‌యార్డ్ అంశంపై వక్రభాష్యం**

అనకాపల్లి టౌన్ రింగ్‌రోడ్డులో గల మార్కెట్ యార్డ్ కన్వెన్షన్ హాల్ నిర్మాణం అంశంపై దాడి వీరభద్రరావు వక్రభాష్యం చెబుతూ అక్కడ స్థలాలను కొట్టేయడానికి తాను ప్రయత్నం చేశానని ఆరోపించడంపై ఎంపీ సత్యవతి మండిపడ్డారు. 2022లో మార్కెట్ యార్డ్‌లో కన్వెన్షన్ హాలు నిర్మాణానికి వారు చూపిన స్థలం సరైనది కాదని అప్పుడే విరమించుకున్నామన్నారు. దీనిపై చర్చకు తాను సిద్ధమని, మీరు సిద్ధమా..? అని సవాల్ విసిరారు. నిబద్ధత, నిజాయతీతో పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేశా... నిరంతరం అనకాపల్లి అభివృద్ధి కోసం కృషి చేశా.. అలాంటి నన్ను నా పని తీరును వక్రీకరించి మాట్లాడితే సహించబోనని ఆమె హెచ్చరించారు. వైవీ సుబ్బారెడ్డి ద్వారా స్వప్రయోజనాలు పొంది ఆయనను విమర్శించడం మీ విజ్ఞతనే తెలియజేస్తుందన్నారు. మీ వ్యక్తిగత స్వలాభం కోసం అభివృద్ధిని ఆటంక పరచి అనకాపల్లికి రూ.500 కోట్లతో మంజూరైన మెడికల్ కళాశాలను న్యాయస్థానాల ద్వారా అడ్డుకున్నారని మండిపడ్డారు. ఇది తరలిపోవడానికి మీరు కాదా కారణం? మీ అంతరాత్మను ప్రశ్నించుకోవాలని ఆమె సూచించారు. అనకాపల్లిలో కోట్లాది రూపాయల ఎంపీ లాడ్స్ నుంచి అనేక నిర్మాణాలను చేపట్టానని, శరవేగంగా జరుగుతున్న బొజ్జన్నకొండ అభివృద్ధి పనులు, కేంద్రీయ విద్యాలయం, భూమి పూజ చేసుకున్న జిల్లా గ్రంథాలయం, కశింకోటలో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు, ఇవేమీ మీకు కనిపించలేదా..? మీరంతా కళ్లున్న కబోదులు అని మండిపడ్డారు.

**సీఎం జగన్ అంటే ఒక బ్రాండ్..**

వైఎస్సార్‌సీపీలో జగనన్న బ్రాండ్‌తో తాను ఎంపీగా, గుడివాడ అమర్‌నాథ్‌ను ఎమ్మెల్యేగా గెలిచామని, అంతేగానీ నీవు ఏదో భుజాలతో గెలిపించినట్టు గొప్పలు చెప్పుకుంటున్నావా..? అని దాడిని ఉద్దేశించి ప్రశ్నించారు. మీ వార్డులో వైఎస్ఆర్సీపీకి ఎన్ని ఓట్లు వచ్చాయో క్రాస్ చెక్ చేసుకోండి అని అన్నారు.

**ఎంపీ నిధులతో అభివృద్ధి..**

రూ.25 కోట్ల ఎంపీ నిధులతో పాటు అదనంగా మరో రూ.9.8 కోట్లు ఎంపీ నిధులతో అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రాంత రైతులకు కోసం రూ.3.8 కోట్లతో ఇంక్యుబేషన్ సెంటర్ నిర్మాణం, శంకరం గ్రామంలో రూ.70 లక్షలతో గురజాల కల్చరల్ భవనాన్ని మల్టీ ఫంక్షనల్ హాల్ తరహాలో నిర్మిస్తున్నామని, టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యిందని అన్నారు. సుమారుగా 500 మంది కుర్చొనేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు తెచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. అలాంటి కళా కేంద్రానికి కళంకం తీసుకొస్తే సహించేది లేదన్నారు. ఎన్టీఆర్ క్రీడామైదానంలో రూ.70 లక్షలతో మహిళా క్రీడాకారులకు డార్మిటరీ నిర్మాణం, రూ.25 లక్షలతో వ్యాయామశాల, అలాగే కశింకోట అంబేడ్కర్ భవనానికి రూ.50 లక్షలు, రూ.60 లక్షలతో శాంతి పార్కు అభివృద్ధి, రూ.20 లక్షలతో ఎస్సీ హాస్టల్ స్టడీ సెంటర్, రూ. 7.5 కోట్లతో బొజ్జన్నకొండ అభివృద్ధి, రూ.95 లక్షలతో జిల్లా లైబ్రరీ వంటి అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. ఇంతేకాకుండా ఏషియన్ పెయింట్ సీఎస్సార్ నిధులు రూ.27 లక్షలతో బయ్యవరం, తోటాడలో చెరువు మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు.



దేవరాపల్లి నుండి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు



మల్లాంలో కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి స్వాగతిస్తున్న విప్ ధర్మశ్రీ



యరకన్నపాలెం నుంచి పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే గణేష్

# వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ

- దేవరాపల్లిలో 25 టీడీపీ కుటుంబాల చేరిక
- సాదరంగా ఆహ్వానించిన ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: టీడీపీకి గట్టి షాక్ తగిలింది. దేవరాపల్లిలో 25 కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి మంగళవారం తారువలో డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. దేవరాపల్లి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశారని, కాలినడకన సైతం వెళ్లలేని కళ్లాలకు తారురోడ్లు నిర్మించిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కిందని వారంతా అన్నారు. అన్ని వీధుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, అధ్వానంగా ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆధునీకరించారన్నారు. దేవరాపల్లిని అభివృద్ధికి కేరాఫ్‌గా తీర్చిదిద్దిన బూడి నాయకత్వానికి ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. అనకాపల్లి ఎంపీగా బూడిని, మాడుగుల ఎమ్మెల్యేగా ఈర్లె అనురాధను గెలిపించేందుకు తామంతా కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఇరుబల్లి అప్పలనాయుడు, కొల్లి రమణ, గాలి రాంబాబు, గాలి దేముళ్లు, చిటికిరెడ్డి చెల్లంనాయుడు, గాలి బంగారమ్మ, చిటికిరెడ్డి పోతురాజు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, సీనియర్ నాయకుడు గండి పడాల అప్పలరాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరదపురెడ్డి లలితానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ పాల్గొన్నారు.

**బుచ్చెయ్యపేట మండలంలో జనసేన, టీడీపీ నుంచి..**

బుచ్చెయ్యపేట: మండలంలోని మల్లాం గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ నాయకులు తమ పార్టీలను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. జనసేన మండల యూత్ విభాగం అధ్యక్షుడు మువ్వల భాస్కరరావు, టీడీపీకి చెందిన కిల్లాడి నాగరాజు, మువ్వల దేముడు తదితరులు తమ కుటుంబ సభ్యులు మంగళవారం చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ధర్మశ్రీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నమ్మి అప్పలరాజు, సర్పంచ్ బర్ల శివ, నాయకులు బోర అప్పలనాయుడు, ఒయిబోయిన అప్పలనాయుడు, భర్నికాన చిన అప్పలనాయుడు, గొలగాని లోవరాజు, మువ్వల అప్పలనాయుడు పాల్గొన్నారు.

**మాకవరపాలెం మండలంలో 25 కుటుంబాలు..**

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా మండలంలోని రాచపల్లి శివారు యరకన్నపాలెంలోని టీడీపీకి చెందిన 15 కుటుంబాలు, తామరంలోని మరో పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి మంగళవారం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలిపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, తామరం సర్పంచ్ గొంతిన చెల్లాత్నం, రాచపల్లి మాజీ సర్పంచ్‌లు పెట్ల భద్రాచలం, దొరబాబు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కన్నబాబు

రాంబిల్లి: వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబు)కోరారు. రాంబిల్లిలో మంగళవారం టీడీపీకి చెందిన సూరాడ ప్రసాద్, చింతకాయల జగ్గారావు, సూరాడ శేఖర్, కారె అప్పలరాజు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కన్నబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాలనాయుడును గెలిపించాలన్నారు. సంక్షేమం, అభివృద్ధిని గ్రామాల్లో వివరించి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్.వి.సూర్యనారాయ ణ, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామ కృష్ణ, వాడనర్సాపురం సర్పంచ్ కారె రామారావు తదితరులు పాల్గొన్నారు.

### బంగారు ఆభరణాల చోరీ

కోటవురట్ల: జమాదులపాలెంలో సోమవారం రాత్రి 3 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. ఒమ్మి సత్యనారాయణ ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు తెరచి లోపలికి ప్రవేశించి బీరువాలో బంగారు నగలు దొంగిలించుకుపోయారు. వీటివిలువ రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ ఎం.వి నోద్‌బాబు తెలిపారు.

## ఎన్నికల సిత్రాలు

### జోరుగా ప్రచారం

జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. అందరినీ పలకరిస్తూ తమకు మద్దతు తెలపాలని కోరుతున్నారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ముందంజలో ఉన్నారు.



గెలుపు దరువు : పాయకరావుపేట ఎస్సీ కాలనీలో డప్పు వాయిస్తూ ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుకు మద్దతుగా డ్యాన్సులు వేస్తున్న దళిత నేత అర్జున్



పెద్దల ఆశీసులు: నర్సీపట్నం మున్సిపాలిటీలో చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రచారం చేశారు. నా మద్దతు మీకే అంటూ ఓ వృద్ధురాలు ఆయనను ఆశీర్వదించారు.



కాకెక్కిన ప్రచారం : అనకాపల్లి మండలం తుమ్మపాలలో దుస్తులకు ఇస్త్రీ చేస్తూ భరత్‌కుమార్ ప్రచారం చేశారు. అక్కచెల్లెమ్మల మద్దతు తనకే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.



'చిరు'నవ్వులతో : కె.కోటపాడు మండలం గొండుపాలెంలో చిరు వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

# నేతలు ముందుకు.. క్యాడర్ వెనక్కు!

- పొత్తులున్న చోట పెద్దలకే ప్యాకేజీ
- చోటా మోటా నాయకులపై చిన్న చూపు
- రగిలిపోతున్న జనసేన, టీడీపీ శ్రేణులు
- ఎన్నికల ప్రచారానికి దూరం దూరం

సాక్షి, విశాఖపట్నం: పొత్తులో ఒకరికొకరు సీట్లను సర్దుబాటు చేసుకున్న కూటమి అభ్యర్థులు మిత్ర పక్ష పార్టీల పెద్దలకే ప్యాకేజీల్లో పెద్దపీట వేస్తున్నారు. తమపై చిన్న చూపు చూస్తున్నారన్న భావనలో చోటా మోటా నాయకులున్నారు. వాస్తవానికి టీడీపీ, జనసేన పార్టీల నేతలు ఉమ్మడి విశాఖ జిల్లాలో సగానికి పైగా స్థానాల్లో సీట్లను ఆశించి భంగపడ్డారు. ఆరంభంలో వీరు తమ అధినేతల తీరుపై తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీ కార్యక్రమాలకూ దూరంగా ఉన్నారు. మరికొందరు తిరుగు బావుటా ఎగురవేశారు. నోటిఫికేషన్‌తో పాటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టికెట్లు దక్కించుకున్న కూటమి అభ్యర్థులు బుజ్జగింపుల పర్వానికి దిగారు. టికెట్లు ఆశించి భంగ పడ్డ వారితో పాటు పార్టీలో కీలక నాయకుల ఇళ్లకు వెళ్లారు. వారి స్థాయిని బట్టి విడతల వారీ ప్యాకేజీలకు ఒప్పించారు. ఇలా ప్యాకేజీ సెటిల్‌మెంట్లు రూ.లక్షలు, కోట్లలో జరిగిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. వీటికి తలొగ్గిన నేతలకు ఇప్పటికే ప్యాకేజీ సొమ్మును కొంతమేర పంపిణీ చేశారు. ఎలక్షన్ ప్యాకేజీతో అలక వీడిన నేతలు కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారానికి వెళ్తున్నారు. అయితే దిగువ స్థాయి నాయకులకు మాత్రం ఈ పరిణామం మింగుడు పడడం లేదు. వీరికి కూటమి అభ్యర్థులు ఇచ్చిన ప్యాకేజీ సొమ్ములో తమకు కూడా కొద్దోగొప్పో ఇవ్వకుండా వారే స్వాహా చేస్తున్నారంటూ రగిలిపోతున్నారు. కొన్ని చోట్ల తక్కువ ఖర్చుతో అయిపోయే విందు భోజనాలతోనే సరిపెడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇలా మన స్తాపంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి అభ్యర్థులు బరిలో ఉన్న చోట ప్యాకేజీ అందుకున్న పెద్ద నేతలే తప్ప కింది స్థాయి క్యాడర్ ప్రచారానికి దూరంగా ఉంటున్నారు.

**ఇదీ పరిస్థితి..**

భీమిలి టికెట్‌ను కూటమిలో టీడీపీ తరఫున గంటా శ్రీనివాసరావుకు కేటాయించారు. ఈ సీటును జనసేన నుంచి పంచకర్ల సందీప్, టీడీపీ నుంచి కోరాడ రాజబాబు ఆశించారు. ఆఖరి నిమిషంలో ఈ సీటును గంటా తన్నుకుపోవడంతో తొలుత వీరు అలకబూనారు. రాజబాబు అయితే గంటాపై తీవ్ర అవినీతి ఆరోపణలు కూడా చేశారు. పరిస్థితిని గ్రహించిన గంటా.. రాజబాబు ఇంటికి వెళ్లి బుజ్జగించారు. సందీప్‌కూ ×సర్దితే చెప్పారు. వీరిద్దరినీ భారీ ప్యాకేజీతో దారిలోకి తెచ్చుకోవడంతోనే గంటా వెంట ప్రచారంలో పాల్గొంటున్నారన్న ప్రచారం ఆ పార్టీ శ్రేణుల్లోనే జరుగుతోంది. అలాగే విశాఖ ఉత్తర టికెట్‌ను బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజుకు కేటాయించారు. అక్కడ జనసేనలో కిందిస్థాయి శ్రేణులకు ప్యాకేజీ అందకపోవడంతో ప్రచారానికి దూరంగా ఉన్నారని తెలిసింది. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు టీడీపీలో పైస్థాయి నేతలనే ప్రసన్నం చేసుకోవడంతో దిగువ క్యాడర్ ప్రచారంలో పాల్గొనడం లేదని చెబుతున్నారు. యలమంచిలి టీడీపీ సీటును ప్రగడ నాగేశ్వరరావు ఆశించారు. కానీ పొత్తులో జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు ఇచ్చారు. తొలుత తన వర్గంతో ఆందోళనకు దిగిన ఆయనకు భారీ ప్యాకేజీ అందడంతో కొద్దిరోజుల నుంచి ప్రచారంలో పాల్గొంటున్నారని, ఆయన అనుచరులు మాత్రం దూరంగా ఉంటున్నారని అంటున్నారు. ఇక పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి అనితను అక్కడ జనసేన నేతలు ఆది నుంచి వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల అనకాపల్లి లోక్‌సభ కూటమి అభ్యర్థి సీఎం రమేష్ రంగంలోకి దిగి సర్దుబాటు చేసినా కింది స్థాయి క్యాడర్ టీడీపీ అభ్యర్థి ప్రచారంలో అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అరకు సీటును తొలుత టీడీపీలో దొన్నుదొరకు ప్రకటించారు. ఆ తర్వాత బీజేపీకి మార్చారు. దీనిపై టీడీపీలో నిరసనలు వ్యక్తమయ్యాయి. పెద్దలకు సర్దుబాటుతో ఇప్పుడు కొంతమంది ప్రచారంలో పాల్గొంటున్నారు.

# 207 కిలోల గంజాయి పట్టివేత

- ఇద్దరి అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలు తెలుపుతున్న నర్సీపట్నం డీఎస్పీ మోహన్



అప్పలరాజుపురం కాటా వద్ద స్వాధీనం చేసుకున్న బైకులు, గంజాయి

గొలుగొండ: కృష్ణదేవిపేట అల్లూరి పార్కు సమీపంలో మంగళవారం బైక్‌లపై తరలిస్తున్న 207 కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరిని అరెస్టు చేసి, కోర్టుకు తరలించినట్టు నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు. కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి రెండు బైక్‌లపై గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో కృష్ణదేవిపేట పోలీసులు అప్రమత్తమైనట్టు చెప్పారు. మాటువేసి గంజాయిని పట్టుకున్నట్టు తెలిపారు. దీని విలువ రూ.10 లక్షలు ఉంటుందని చెప్పారు. రోలుగుంట మండలం నాయుడుపాలెంకు చెందిన హరిబాబు, అల్లూరి జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. చాకచక్యంగా గంజాయిని పట్టుకున్న కృష్ణదేవిపేట ఎస్‌ఐ ఉపేంద్రతో పాటు సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ హరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**ఎనిమిది కిలోల గంజాయి స్వాధీనం**

చీడికాడ: బైక్‌లపై తరలిస్తున్న గంజాయిని మండలంలోని అప్పలరాజుపురం కాటా వద్ద స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ నారాయణరావు మంగళవారం తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అప్పలరాజుపురం కాటా వద్ద వాహనాలు తనిఖీ చేసినట్టు చెప్పారు. ఆ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన హుకుంపేటకు చెందిన కొల్లి అనిల్‌కుమార్,అగనంపూడికి చెందిన వెల్లి రాజు,అగనంపూడికి చెందిన బాలుడి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా ఎనిమిది కిలోల గంజాయి బయటపడినట్టు తెలిపారు. గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్టు ఎస్‌ఐ తెలిపారు.

# బస్సు యాత్రకు 'మేమంతా సిద్ధం'



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ

- 20న చోడవరంలో సీఎం బహిరంగ సభ
- భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలి
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పిలుపు

దేవరాపల్లి: జిల్లాలో ఈ నెల 20న జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తారువలో వైఎస్సార్‌సీపీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ నెల 20న జిల్లాలోకి ప్రవేశించే బస్సు యాత్రకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి ఆత్మీయ స్వాగతం పలకాలని సూచించారు. అదే రోజు చోడవరంలో మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బ్రహ్మాండమైన బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు ఒక్క దేవరాపల్లి మండలం నుంచే 10 వేల మందికి పైగా జనం హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు.

**అన్ని సర్వేల్లో వైఎస్సార్‌సీపీకే విజయం**

రానున్నది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పదికి పైగా సర్వేలతో పాటు కేంద్రం చేపట్టిన సర్వేలో సైతం స్పష్టమైందని ముత్యాలనాయుడు చెప్పారు. సీఎం జగన్ చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీకి గెలుపు సోపానాలుగా నిలుస్తాయన్నారు. చిన్నపాటి మనస్పర్థలను వీడి ఎన్నికల సమరంలో ప్రతీ కార్యకర్త సైనికుడిలా కష్టపడి పనిచేసి, సీఎం జగన్ చేసిన మేలును క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ధన బలంతో గెలవాలని పగటి కలలు కంటున్న కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కుట్రలు వైఎస్సార్‌సీపీ జన బలం ముందు నిలవలేవన్నారు. స్థానికేతురులైన వీరి మాటలు ప్రజలు నమ్మడం లేదని, తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తదితర పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితర్లు పాల్గొన్నారు.

# 42 మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్‌ఐ రమణయ్య

కోటవురట్ల: అక్రమంగా ఇంట్లో నిలువ చేసిన మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. పందూరు గ్రామానికి చెందిన బత్తుల నాగ వెంకట సన్యాసిశెట్టి అనే వ్యక్తి ఇంటిపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేయగా 42 మద్యం సీసాలు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ.6,426 ఉంటుందని, నిందితునిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## 21న ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తుమ్మపాల : ఈ నెల 21 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5 మోడల్ స్కూళ్లలో నిర్వహించే పరీక్షకు విద్యార్థులు నిర్దేశిత సమయానికి గంట ముందుగా పరీక్ష కేంద్రానికి హాజరుకావాలన్నారు.

విద్యార్థులు www.cse.ap.gov.in/apms.ap. gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించి ఉపాధ్యాయుల సూచనలను ముందుగానే విద్యార్థులు తీసుకోవాలని తెలిపారు. బ్లూ, బ్లాక్ బాల్‌పెన్‌తో మాత్రమే సమాధానాలు పూరించాలన్నారు. హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే సంబంధిత పాఠశాల హెచ్‌ఎం నుంచి రెండు ఫొటోలను అటెస్టేషన్ చేసి తీసుకురావాలన్నారు. మరింత సమాచారం కోసం సమీపంలోనే ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

# 60 మంది వలంటీర్ల రాజీనామా



పందూరు గ్రామ సచివాలయంలో రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

రాంబిల్లి: మండలంలో ఐదు గ్రామాలకు చెందిన 60 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఎంపీడీవో ఎస్. వెంకటాచలానికి రాజీనామా పత్రాలు అందజేశారు. గోకివాడ, మురకాడ, వెల్చూరు, గోవిందపాలెం, వాడనర్సాపురం , కట్టుబోలు తదితర సచివాలయాలకు చెందిన 139 మంది వలంటీర్లు ఇప్పటివరకు రాజీనామాలు చేసినట్టు ఎంపీడీవో వెంకటాచలం తెలిపారు.

**కోటవురట్ల మండలంలో..**

కోటవురట్ల: టీడీపీ, జనసేనల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలకు మనోవేదనకు గురైన మండలంలోని 83 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. వారంలో రోజులుగా మండలంలోని వలంటీర్ల రాజీనామా పర్వం కొనసాగుతోంది. మంగళవారం నాటికి మొత్తం వలంటీర్లు 327 మంది రాజీనామాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు జగనన్న ఆశయం కోసం పనిచేశామని, ఇకపై స్వేచ్ఛాయుతంగా జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికులుగా పనిచేస్తామని స్పష్టం చేశారు.



రాజీనామా చేసిన గోకివాడ వలంటీర్లు

# 45 ఎకరాల్లో తోటలు దగ్ధం

బుచ్చెయ్యపేట/రోలుగుంట/కె.కోటపాడు: జిల్లాలో మూడు మండలాల్లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదాల్లో 45 ఎకరాల్లోని జీడిమామిడి, టేకు, యూకలిప్టస్, సరుగుడు తోటలు దగ్ధమై సుమారు రూ.28 లక్షల నష్టం వాటిల్లింది. 24 మంది రైతులు నష్టపోయారు. బుచ్చెయ్యపేట మండలం పెదమదీనలో సంభవించిన అగ్ని ప్రమాదంలో సుమారు 38 ఎకరాల్లో సరుగుడు,యూకలిప్టస్ తోటలు దగ్ధమయ్యాయి. దారినపోయే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిపారేసిన సిగరెట్టు కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్టు గ్రామస్తులు,అధికారులు తెలిపారు. 22 మంది రైతులకు చెందిన సుమారు 38 ఎకరాల్లో రెండు నుంచి ఐదేళ్ల వయస్సు గల సరుగుడు,యూకలిప్టస్ తోటలు,70 తాటిచెట్లు కాలిపోగా రూ.25 లక్షలకు పైగా నష్టం సంభవించినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన కడదాసు సత్తిబాబు, నమ్మి శ్రీను, దాలిబోయిన కొండబాబు, శ్రీను,యలంశెట్టి శేఖర్,వీపు పోతురాజు, ఈశ్వరరావు,నక్కా శ్రీను,దండురు కొండలరావు,రమణ, మల్లవరపు నాగరాజు,వియ్యపు అప్పారావు,అల్లం వెంకటరావు, జయరామ,సుర్ల గోవిందమ్మ, గుర్రం రమణ,బోయిన అప్పారావు తదితర రైతులకు చెందిన తోటలు కాలిపోయాయి. స్థానికుల సమాచారం మేరకు చోడవరం,అనకాపల్లి అగ్నిమాపక అధికార్లు బి.వి. రామచంద్రరావు,నర్సింగరావులు తమ సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. సచివాలయ అధికార్లు,సిబ్బంది ఉగ్గిన సూర్యనారాయణ,నాగేశ్వరరావు,ఆశ,ఈశ్వరరావు తదితర్లు సంఘటన స్థలంను పరిశీలించారు.

**కుసుర్లపూడిలో...**

రోలుగుంట మండలం మండలం కుసుర్లపూడిలో చుక్కా సత్తిబాబుకు చెందిన ఐదు ఎకరాల్లోని జీడి తోట దగ్ధమైంది. సుమారు రూ.2.50 లక్షల నష్టం జరిగినట్టు అంచనా. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తనకు ఎనిమిదిన్నర ఎకరాల్లో జీడిమామిడి తోటలు ఉన్నాయని, నాలుగు రోజులుగా తోటల్లో పిక్కలు సేకరిస్తున్నామని చెప్పాడు. మంగళవారం తోటలోకి వెళ్లలేదని తెలిపాడు. మధ్యాహ్నం ఒక్కసారిగా తోటలో మంటలు వ్యాపించడంతో గ్రామానికి దూరంగా ఉన్న తోటల దగ్గరకు కుటుంబ సభ్యులందరం పరుగులు తీసి వెళ్లే సరికి ఐదు ఎరకాల్లోని చెట్లు గద్ధమయ్యాయని వాపోయాడు.



పెదమదీనలో కాలిపోతున్న తోటలు,తాడిచెట్లు

ప్రమాదం పై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వచ్చి మంటలు అదుపు చేశారని, అయితే మంటల సెగ కారణంగా మిగిలిన తోటకు కూడా నష్టం వాటిల్లిందని చెప్పారు. తనకు ఎవరూ శత్రువుల లేరని చెప్పాడు. గొప్పులు తీయించేందుకు, సస్యరక్షణ చర్యలకు భారీగా ఖర్చు చేశానని రోదిస్తూ తెలిపాడు. ప్రమాదం ఎలా జరిగిందే తెలియడం లేదని, అధికారులు స్పందించి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరాడు.

**ఎ.కోడూరులో ..**

కె. కోటపాడు మండలంలోని ఎ.కోడూరులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో లెక్కల బాపునాయుడుకు చెందిన రెండు ఎకరాల్లోని టేకు, యూకలిప్టస్, తాటిచెట్లు దగ్ధమయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేల నష్టం జరిగినట్టు మాడుగుల అగ్నిమాపక కేంద్రం అధికారి వి.రాజేశ్వరావు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి పారేసిన సిగరెట్టు కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు.



కుసర్లపూడిలో దగ్ధమవుతున్న జీడితోట



ఎ. కోడూరులో మంటలు ఆర్పుతున్న మాడుగుల అగ్నిమాపక సిబ్బంది

# గడప గడపలో వైఎస్సార్‌సీపీ హోరు

- జోరుగా ప్రచారం చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్
- తుమ్మపాలలో బ్రహ్మరథం పట్టిన గ్రామస్తులు


తుమ్మపాలలో గడప గడపకు ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


80వ వార్డులో ప్రచారం చేస్తున్న కుమార్‌రాజా, కొణతాల నీలిమా భాస్కర్


తనకు ఓటు వేయాలని వృద్ధురాలిని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్


మర్రిపాలెం గ్రామంలో ప్రచార కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

అనకాపల్లి: దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలోని తుమ్మపాలలో పలు వీధుల్లో మంగళవారం ఆయన గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనకు బ్రహ్మరథం పట్టి, ఆశీర్వదించారు. అనంతరం భరత్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 99శాతం హామీలను అమలు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు,పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం మండలంలోని కోడూరు పంచాయతీ మర్రిపాలెంలో ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ ప్రచారం చేశారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, వైఎస్సార్‌సీపీ నేతలు కొసిరెడ్డి పైడిరాజు, పల్ల వెంకట అప్పారావు, ఎస్.శ్రీనివాసరావ, ఆర్.ప్రసాద్, వనం సోమునాయుడు, రంగలి సత్తిబాబు, పల్లా అప్పలనాయుడు, పల్లా చల్లారావు, నాగులాపల్లి శ్రీనివాసరావు,లింగం శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**80వ వార్డులో...**

80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో గవరపాలెం పరిధిలో భరత్‌కుమార్ సోదరుడు మలసాల కుమార్‌రాజా ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయాల చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరారావు, పార్టీ పట్టణ యువజన విభాగ అధ్యక్షుడు-2 వేగి త్రినాథ్, పార్టీ నేతలు కొణతాల సన్యాసినాయుడు, కర్రి మోదినాయుడు, కాండ్రేగుల రాము, పెంటకోట శ్రీను, కొణతాల కృష్ణంరాజు, మారిశెట్టి శ్రీను, బుద్ధ నర్సింగరాజు, దామోదర్, దేవా, అనూరాధ, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**తాళ్లపాలెంలో ...**

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం గడప గడపకు వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. పార్టీ నాయకులు లగిశెట్టి గణేష్, గుమ్మడి నారాయణరావు, ఇందల ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించే బాధ్యత అందరిదీ

ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


ఎన్‌ఆర్‌జీఎస్ కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి: రాష్ట్రంలోని ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నడిపిన జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. మండలంలో తుమ్మపాలలో ఎన్‌ఆర్‌జీఎస్ కార్మికులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు కార్మికుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనువాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, వైఎస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి శేఖర్, గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, పార్టీ సీనియర్ నేతలు పీడి గాంధీ, సీహెచ్ చిన్నా, పీలా బుజ్జి, కొణతాల శివాజీ, పడాల గణపతి, బుదిరెడ్డి దేముడు, కోలపర్తి శ్రీను, ఆడారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి గెలిపించండి


హాజరైన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు


పెద్దగుమ్మంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోట: మండలంలో గడచిన ఐదేళ్లలో కోట్లాది రూపాయలతో చేసిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. స్థానిక గవరపేటలోని పెద్దగుమ్మం, ఎస్సీ కాలనీ వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కశింకోటలో దాదాపు ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మించామని తెలిపారు. పీహెచ్‌సీని అభివృద్ధి చేశామని చెప్పారు. నవరత్నాలు, ఇతర అనేక సంక్షేమ పథకాలను అర్హులకు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేయడానికి తమ సంపూర్ణ మద్దతు అందివ్వాలన్నారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లకు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, వార్డు సభ్యులు కాండ్రేగుల అశ్వని, యల్లపు కుమారి, తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు

## క్లుప్తంగా

### నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా బంద్

అనకాపల్లి: గవరపాలెం విద్యుత్‌శాఖ డి2 సెక్షన్, గాంధీమార్కెట్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కోసం బుధవారం మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆశాఖ ఈఈ కె.రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాగిసుబ్బరాజు గారి వీధి, గౌరీసంఘం వీధి, శతకంపట్టు ఏరియా, ఉమెన్స్ కాలేజీ ఏరియా, దిబ్బవీధి, రైతుసంఘం వీధి, దాడి బోగలింగం వీధి, గంగిరేగి చెట్టు ఏరియా, అరుంధతి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

### నేడు వైఎస్సార్‌సీపీ సమావేశాలు

కశింకోట: స్థానిక హౌసింగ్ కాలనీ, గుర్రం జాషువా కాలనీలలో బుధవారం సాయంత్రం బూత్‌ల వారీగా వైఎస్సార్‌సీపీ సమావేశాలు నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

### గిరిజన పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

మాడగుల రూరల్: ఎల్.పొన్నవోలు శివారు నరసయ్యపేట(దిబ్బూరు) ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బావరాజు అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 20 సీట్లు, ఆరో తరగతిలో 60 సీట్లు, ఎనిమిదో తరగతిలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా తరగతుల్లో చేరే విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాలతోపాటు ఏపీ గిరిజన సంక్షేమ శాఖ అందించే సదుపాయాలు పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9492989123 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### ఎ. కొత్తపల్లిలో 406 మందికి వైద్య పరీక్షలు

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన ఆధ్వర్యంలో 406 మంది రోగులను గైనికాలజిస్టు బి.రోజారాణి, జనరల్ డాక్టరు వి.కోటేశ్వరరావు పరీక్షించారు. పలువురికి రక్త, బీపీ, సుగర్ తదితర పరీక్షలు చేశారు. సీహెచ్‌వో పి.ప్రసాదరావు, ఫార్మాసిస్టు అల్లు సత్యమూర్తి, హెల్త్ అసిస్టెంట్లు గోవింద్, జి.బి. శ్రీను, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 3,515 బెల్లం దిమ్మలు వచ్చాయి

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 3,700 | 4,500 |
| మొదటి రకం | 3,550 | 4,430 |
| రెండో రకం | 3,460 | 4,190 |
| మూడోరకం | 3,300 | 3,480 |

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| లవ్‌గురు | : రాజా |
| శ్రీరంగ నీతులు | : సత్యనారాయణస్క్రీన్-1 |
| ఐమాక్స్ | : సత్యనారాయణస్క్రీన్-2 |
| గీతాంజలి | : షిర్డిసాయి |
| ఫ్యామిలీ స్టార్ | : పర్తిసాయి |
| గుంటూరు కారం | : వెంకటేశ్వర |
| మెర్సీ కిల్లింగ్ | : శ్రీసత్య |
| డీజే టిల్లు-2 | : రామచంద్ర |

## రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-6 యూనిట్లు, ఎ నెగెటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-6 యూనిట్లు, బి నెగిటివ్-2 యూనిట్లు, ఒ పాజిటివ్-11 యూనిట్లు, ఒ నెగిటివ్-2 యూని ట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్, ఏబీ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

## గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 425 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 325 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.



# న్యాయమూర్తి గంగరాజుకు ఘన సన్మానం


న్యాయమూర్తి గంగరాజును సన్మానిస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి: న్యాయమూర్తి గంగరాజు విశేష సేవలందించారని పలువురు న్యాయవాదులు తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి గంగ రాజుకు అనకాపల్లి నుంచి నర్సాపురం బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గంగరాజు పారదర్శకమైన సేవలు అందించారని కొనియాడారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప, రెండవ తరగతి జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, అధ్యక్షులు సాయిలక్ష్మణ్, సెక్రటరీ సూరా శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు సూరా భాస్కరరావు, మజ్జి శ్రీనివాసరావు, జగన్నాథరాజు, కె.పి.వి.రమణయ్య, అడపా సుధాకర్, రాజశేఖర్, బార్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు శ్రీనివాసరావు, జగపతి,సాయిరాం, రామచంద్రరావు,కిషోర్, కుసుమ, లీల తదితరులు పాల్గొన్నారు.

# మానవ తప్పిదాల వల్లే అధిక అగ్నిప్రమాదాలు


స్కూల్ ఆవరణలో విద్యార్థులకు అగ్నిప్రమాదలపై అవగాహన కల్పిస్తున్న నర్సింగరావు

అనకాపల్లి: వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని, మానవ తప్పిదాల వల్ల వేసవిలో అధికంగా ఈ ప్రమాదలు జరుగుతున్నాయని అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక గవరపాలెం ఆదినారాయణ ఇంగ్లిష్‌మీడియం స్కూల్, కళాశాల ఆవరణలో విద్యార్థినీవిద్యార్థులకు మంగళవారం అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు భయపడకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తే నివారించవచ్చన్నారు.

# మెనూ అమలులో నిర్లక్ష్యం చేయొద్దు


విద్యార్థినికి ప్రశ్నలు వేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: పాఠశాలల్లో మెనూ అమలులో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం వెదురుపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి విద్యా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూశారు. నిర్వాహకులకు, హెచ్‌ఎంకు పలు సూచనలు చేశారు. మాధవనగరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పట్ల తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వల్సంపేట గుమ్మడిగొండ గ్రామ సచివాలయాలను తనిఖీలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం దగ్గర్నుంచి రాజకీయ వేడి ఉంటుందని, దానికి తగ్గట్టుగా మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు చినబాబు, రమణ, చందు, శివ సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యవసర ఫోన్ నంబర్లపై అవగాహన

చోడవరం రూరల్: ప్రతి విద్యార్థి భద్రత, విపత్తులకు సంబంధించిన అత్యవసర సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాద, విపత్తుల నివారణ తీసుకోవాల్సిన చర్యల పట్ల చోడవరం అగ్నిమాపకదళ సిబ్బందితో అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ బి.వి.రామస్వామి మాట్లాడుతూ 100, 101, 102, 104, 108 నంబర్ల ద్వారా కలిగే సహాయం, ఏయే శాఖలకు సంబంధించినవి అన్న విషయం తెలిసి ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అగ్ని, నీరు, గ్యాస్ తదితర ప్రమాద సమయాల్లో, ఆగంతకుల నుంచి ఎదురయ్యే ఇతర ప్రమాద సమయాల్లో ఈ నంబర్లకు ఫోన్ చేసి. సహాయం పొందాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, అగ్నిమాపక సిబ్బంది కె.రాము, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

# చెరకు, మామిడి, జీడిమామిడి తోటలపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి: చెరకు, మామిడి, జీడిమామిడి తోటలపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నీటి వసతి ఉన్న చోట చెరకు తోటకు నీటి తడులు ఇవ్వాలని సూచించారు. నీటి వసతి లేని చోట్ల పంట నీటి ఎద్దడికి గురికాకుండా 10 లీటర్ల నీటిలో 25 గ్రాముల యూరియా, 25 గ్రాముల మ్యూరిట్ ఆఫ్ పొటాషియంను కలిపి ఉదయం 8గంటల లోపు, సాయంత్రం 5 తరువాత పిచికారీ చేయాలని తెలిపారు. అధిక ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉన్నందున ఎరువులు వేయడం వాయిదా వేసుకోవాలని సూచించారు. మామిడి, జీడిమామిడి తదితర తోటలకు తరచూ నీటి తడులను ఇస్తూ వీలైతే మంచింగ్ చేసుకోవాలని చెప్పారు. పశువులు, కోళ్లను నీడగా ఉండే ప్రదేశాల్లో ఉంచాలని, తాగడానికి నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. రాగల ఐదు రోజుల్లో వాతావరణం పొడిగా ఉండి తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీహెచ్ ముకుందరావు, వి.గౌరి, ఎం. విశాలాక్షి, ఎ. శిరీషా, వి. చంద్రశేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి తదితరులు పాల్గొన్నారు.

### వీరేశలింగం పంతులుకు ఘన నివాళి

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో సాహితీవేత్త, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నూతలగుంటపాలెంలో సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వీరేశలింగం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

# అంగన్‌వాడీ సమయాలను కుదించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగశేషు

అనకాపల్లి: వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రాల సమయాన్ని కుదించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగశేషు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒకేసారి రేషన్ సరుకులు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, కోశాధికారి బి.వి.రమణమ్మ, నాయకులు కె.రామలక్ష్మి, తనూజ, ఉమా, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రాములోరి పెళ్లికి వేళాయె

- శ్రీరామనవమికి భారీగా ఏర్పాట్లు


తాళ్లపాలెం రామాలయంలో సీతారాముల విగ్రహాలు


నీడ కోసం వేసిన షామియానాలు


విద్యుత్ దీపాల అలంకరణలో కశింకోట గవరపేట శారదా గణపతి రామాలయం


సీతారాముల కల్యాణానికి ఏర్పాటు చేసిన వేదిక


రంగులతో అలంకరించిన వేల్పులవీధి రామాలయం


కొత్తతలారివానిపాలెంలో సీతారాముల విగ్రహాలు

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో బుధ వారం శ్రీరామ నవమి ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా కశింకోటలోని ఆరు చోట్ల సీతారాముల కల్యాణోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో విశేషంగా భద్రాది తరహాలో కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. శారదానదిలో తెప్పోత్సవం ఆకర్షణీయంగా నిలుస్తుంది. ఆలయాన్ని పునర్నిర్మించినప్పటి నుంచి నాలుగు దశాబ్దాలుగా భారీ స్థాయిలో కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదిక, సభా ప్రాంగణం ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఉదయం కోలాటాలు, చిటికెల భజనలు, సన్నాయి మేళా, తోడ పెద్దు సేవలతో గ్రామ వీధుల్లో ఊరేగించి, ఆలయం వద్ద సంప్రదాయంగా ఉదయం 11.45 గంటలకు కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బీశెట్టి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు. విశాఖలోని కూర్మన్నపాలెంకు చెందిన మింది సత్య కల్యాణ్, మాధవి దంపతులు కల్యాణాన్ని జరిపిస్తారన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనంతరం మహిళల కోలాటాలు, చిటికెల భజనలు ఉంటాయన్నారు. రాత్రి 8.30 గంటలకు శారదానదిలో దోనెలపై తెప్పోత్సవం, అనంతరం ఆలయంలో ఉయ్యాల సేవ, పవళింపు సేవ, పుష్పాంజలి కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. స్థానిక పూసర్ల వీధి రామాలయంలో సీతారాముల కల్యాణం, భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేవదాయ శాఖకు చెందిన కోదండ సీతారామచంద్రమూర్తి దేవాలయంలో సంప్రదాయంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు అర్చకుడు రేజేటి మారుతి తెలిపారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సాన్ని నిర్వహిస్తారన్నారు. స్థానిక కనక మహాలక్ష్మి వీధి రామాలయంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగరాజు, కృష్ణవేణి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం, అన్న సమారాధన నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. పూసర్ల వీధి, ఎస్సీ కాలనీల్లోని రామాలయాల్లో కూడా సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం, ఏఎస్ పేట, బంగారయ్యపేట,బయ్యవరం, కన్నూరుపాలెం, నరసింగబిల్లి, సోమవరం, తదితర గ్రామాల్లోని రామాలయాల్లో కూడా సీతారాముల కల్యాణంతోపాటు భారీ అన్న సమారాధనలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు.

**అనకాపల్లి మండలంలో...**

అనకాపల్లి: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక వేల్పులవీధి, మళ్లవీధి, కోట్ని వీధి, గాంధీనగరం, లక్ష్మీదేవిపేట, పూడిమడక రోడ్డు రహదారి, గవరపాలెం తదితర ప్రాంతాలు, మండలంలో 32 పంచాయతీల్లో రామాలయాల వద్ద కల్యాణ వేడుకలు నిర్వహించనున్నారు. వేల్పులవీధిలో సీతారాముల ఆలయానికి ప్రత్యేకంగా రంగులు వేసి, ముస్తాబు చేశారు. నవమి ఉత్సవాల్లో భాగంగా పూడిమడక రహదారిలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపును మంగళవారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కోలాటం స్థానికులను ఆకర్షించింది. అంతకు ముందు మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. బుధవారం ఆలయాల వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

తుమ్మపాల: మండలంలో గొలగాం పంచాయతీ కొత్తతలారివానిపాలెంలో న్యూమరాలజిస్టు నారపిన్ని నానాజీ, శంకరి దంపతుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా కోదండ సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం, సాయంత్రం అన్నసమారాధన జరపనున్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేగించనున్నారు. రాత్రి 8 గంటలను ప్రజల సమస్యలకు పరిష్కర వేదిక ద్వారా జవాబులు చెప్పనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

# వడగాడ్పులతో అవస్థలు

కశింకోట: ఎండల తీవ్రత, వడగాడ్పులతో మండల ప్రజలు మంగళవారం తీవ్ర అవస్థలకు గురయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ వేడిమి అధికంగా ఉంది. దీంతో అధిక శాతం మంది ఇళ్లకే పరిమితమయ్యారు. నిత్యం సందడిగా ఉండే కశింకోట ప్రధాన రోడ్లు, వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి.


వెలవెలబోయిన కశింకోటలోని ప్రధాన రహదారి